సాక్షి
జగిత్యాల
శనివారం । 7 । జనవరి । 2023



టీచర్ పోస్టులు భర్తీచేయాలి

జగిత్యాల: 44 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని జీసీ సంక్షేమ సంఘం నాయకులు అదనపు కలెక్టర్‌కు విన్నవించారు.



బదిలీలు చేపట్టాలి

జగిత్యాల: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టాలని డీటీఎఫ్ నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు.

గరిష్టం/కనిష్టం
28.0/15.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ర్యాంక్ పొందడం అభినందనీయం



అభినందిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాల: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జగిత్యాల మున్సిపల్ ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ కేటగిరీలో ర్యాంక్ సాధించడం అభినందనీయమని కలెక్టర్ రవి అన్నారు. గురువారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అడిషనల్ కలెక్టర్ మకరంద్, మున్సిపల్ కమిషనర్ నరేశ్ హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని శుక్రవారం అభినందించారు. మున్సిపల్‌ను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యం



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాశ్

జగిత్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కీలకమని డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన హైదరాబాద్ హకీంపేట 99 బెటాలియన్‌కు చెందిన ర్యాపిడ్‌యాక్షన్ ఫోర్స్‌లోని 70 మందితో డీఎస్పీ దేవిశ్రీ గార్డెన్స్‌లో శుక్రవారం సమీక్షించారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ 1991లో ఆవిర్భవించిందని, అల్లర్లు జరిగిన ప్రదేశాలకు ర్యాపిడ్ యాక్షన్ బృందం చేరుకుని శాంతిభద్రతలు పరిరక్షిస్తుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల్లో సేవలు అందిస్తుందని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, సీఐ కిశోర్, ర్యాపిడ్ యాక్షన్ అసిస్టెంట్ కమాండర్ రాహుల్ రామారావు, ఇన్‌స్పెక్టర్స్ బాలస్వామి, డీఎస్ మాస్కర్, జయప్రకాశ్, విష్ణుకుమార్, రఘు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ చేశారు.

డిగ్రీలో ప్రవేశాలు

కోరుట్లటౌన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 5 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2022లో ఇంటర్మీడియట్ పూర్తి చేసినవారు, ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు అర్హులని ఆమె వివరించారు.

పోటీలకు సిద్ధం కావాలి

జగిత్యాల: నిర్మల్‌లోని కొండాపూర్ సెయింట్ థామస్ హైస్కూల్‌లో ఈనెల 9 నుంచి 11 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సంసిద్ధంగా ఉండాలని డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సూచించారు. జిల్లాలో ఇప్పటికే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించామన్నారు. ప్రతిభ కనబర్చిన ఐదుగురు విద్యార్థులు ఇన్‌స్పైర్ రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వివరాలకు సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ 94401 94120 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'అభివృద్ధి' నివేదికలపై శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీవో తిరుతమలదేవి

మల్లాపూర్(కోరుట్ల): అభివృద్ధి, అభ్యసన నివేదికలపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు సీడీపీవో తిరుమలదేవి తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళల్లో రక్తహీనతను అధిగమించడం, పుట్టిన పిల్లలకు ఆర్నెల్ల వరకు తల్లి పాలే ఇవ్వడం, ఆ తర్వాత అనుబంధ పోషకాహారం అందించడం వంటి అంశాలే ప్రధానమని సీడీపీవో వివరించారు.

స్త్రీనిధి పక్కదారిపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

రాయికల్(జగిత్యాల): 'స్త్రీనిధి పక్కదారి .. మహేశ్ సూత్రధారి' శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఘటనపై విచారణ చేపట్టి సొమ్ము రికవరీ చేయాలని డీఎంపీ సునీత, ఆర్ఎం నాగేంద్ర ఈమేరకు మెప్మా పీడీ నరేశ్ ఆదేశించారు. ఈక్రమంలో పట్టణంలో విచారణ చేపట్టారు. మహేశ్ రూ.4.19 లక్షలు సొంతానికి వాడుకున్నట్లు వాంగ్మూలం ఇచ్చారు. రికవరీ కోసం ఆడిట్ నిర్వహిస్తామని ఆర్ఎం నాగేంద్ర తెలిపారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం



జగిత్యాల గ్రేడ్-1 మున్సిపాలిటీలో రోడ్లను శుభ్రం చేసేందుకు సుమారు రూ.50లక్షలు వెచ్చించి ఇటీవల దీనిని కొనుగోలు చేశారు. కొద్దిరోజులకే మరమ్మతుకు రావడంతో బల్దియాలోని వాటర్ ట్యాంక్ వద్ద మూలన పడేశారు.

మరమ్మతు చేయిస్తున్నాం



ప్రస్తుతం మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న వాహనాలతో చెత్త తరలిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. మూలనపడ్డ వాటి రిపేరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. ప్రతిపాదనలు రూపొందించి మరమ్మతు చేయిస్తాం.

– నరేశ్, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల,

సమాచారం

వార్డులు 48	బ్లేడ్ ట్రాక్టర్ 1
ట్రాక్టర్లు 45	స్వీపింగ్ మిషన్ 1
ఆటోలు 11	ఫాగింగ్ మిషన్ 2
	టిప్పర్ 1

- దాదాపు రూ.15లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన బ్లేడ్ ట్రాక్టర్ ఇది. నిర్వహణ లోపంతో కొద్దిరోజులకే మరమ్మతులకు వచ్చింది. చేసేదిలేక అగ్నిమాపక కేంద్రంలో ఓ మూలనపడేశారు.



- చెత్త సేకరించే ప్రధాన ట్రాక్టర్లు ఇవి. మరమ్మతు కోసం ఓ వర్క్‌షాప్‌కు తరలించారు. రిపేరు చేశాక బిల్లులు మంజూరవుతాయో, లేదోననే అనుమానంతో గ్యారేజీలో ఇలా వదిలేశారు. తొలుత డబ్బులు ఇస్తే మరమ్మతు చేసేవారని అంటున్నారు.



- మూలనపడ్డ వాహనాలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- కంపుకొడుతున్న డ్రైనేజీలు
- దుర్వాసన వెదజల్లుతున్న కాలనీలు

జగిత్యాల: జిల్లాకేంద్రం.. గ్రేడ్–1 మున్సిపల్ జగిత్యాలలో పారిశుధ్యం నిర్వహణ గాడితప్పుతోంది. చెత్తాచెదారం తరలించేందుకు, రహదారులు శుభ్రం చేసేందుకు, డ్రైనేజీలు పూడిక తీసేందుకు, ఫాగింగ్ చేసేందుకు.. ఇలా బల్దియాలో ఏ పనిచేసేందుకైనా యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. వాటి కొనుగోలుకు రూ.లక్షలు వెచ్చిస్తున్నా.. నిర్వహణపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా కొద్దిరోజులకే రిపేరుకు రావడంతో బాగు చేయించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బల్దివాసుల నుంచి వస్తున్నాయి.

వాహనాలు, సిబ్బంది కొరత..

- జగిత్యాల బల్దియాలో శివారు గ్రామాలు ఇటీవల విలీనమయ్యాయి.
- వార్డుల సంఖ్య 48కు చేరింది. ఇందుకు తగినట్లుగా పారిశుధ్య విభాగంలో కార్మికుల సంఖ్యలేదు. వాహనాల కొరత ఉంది.
- చెత్త సేకరణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 'స్వచ్ఛ సర్వేక్షణ్ అందరి బాధ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలకే పరిమితం అవుతున్నారు.

చెత్త సేకరణలో తీవ్రజాప్యం..

చెత్త సేకరించే వాహనాలు వారానికోసారి ఇంటింటికీ వెళ్తున్నాయి. ఫలితంగా చెత్త సేకరణలో జాప్యం జరుగుతోంది. తడి, పొడి చెత్త వేరు చేయాలని, ఇంటి ఎదుటకు వచ్చిన మున్సిపల్ వాహనానికే చెత్త అందించాలంటూ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. కానీ, తప్ప చెత్త సేకరణకు అవసరమైన మేరకు వాహనాలను సమకూర్చడం లేదు. దీంతో ఖాళీ స్థలాల్లోనే కొందరు చెత్త పడేస్తున్నారు. తద్వారా ప్లాట్ల యజమానులు, సమీప నివాసాల వారి మ ధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మరో వైపు.. ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఉండవద్దని, చెత్త పేరుకుపోతే యజమానులనే బాధ్యులుగా చేస్తూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. కానీ, చెత్త వాహనాలను సమకూర్చలేకపోతున్నారు.

శిథిలమైన రహదారితో..

జగిత్యాలలో సేకరించిన చెత్త డంపింగ్ చేసేందుకు నల్లగుట్ట ప్రాంతంలో ఒక యార్డు ఉంది. దానిసమీపంలోనే తిమ్మాపూర్ ఉంది. అయితే, నల్లగుట్ట వద్ద చెత్త డంప్ చేయొద్దని గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. చేసేదిలేక నర్సింగాపూర్ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. ఆ రోడ్డు శిథిలమైంది. వాహనాలు గుంతల్లో పడుతూ తరచూ రిపేరుకు వస్తున్నాయ వాహనదారులు చెబుతున్నారు.

టమాట రైతు విలవిల

- పతనమైన ధర .. రూ.2కే కిలో
- పెట్టుబడి కూడా రాని వైనం
- లబోదిబోమంటున్న అన్నదాత

జగిత్యాలఅగ్రికల్చర్: మొన్నటివరకు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50– రూ. 60 వరకు పలికిన టమాట ధర.. ఇప్పుడు కిలో రూ.5– రూ.10కి పడిపోయింది. తోటల్లో తెంపుకుని.. మార్కెట్ వరకు తరలించి.. హోల్‌సేల్‌గా విక్రయిస్తున్న రైతుకు కిలోకు రూ.2కు మించి రావడం లేదు. పతనమవుతున్న ధరలు వినియోగదారులకు ఊరటనిస్తున్నా.. ఆరుగాలం శ్రమించి.. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్న అన్నదాతకు కన్నీళ్లు తెప్పిస్తోంది. సాగుకు పెట్టిన పెట్టుబడులు రాకపోగా.. తోటల్లో తెంపినందుకు కూలీలకు చెల్లించే కూలి డబ్బులు కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ 5 టన్నుల –6 టన్నుల దిగుబడి..

- జగిత్యాల పూర్తిగా వ్యవసాయాధిత జిల్లా. వివిధ పంటలతోపాటు కూరగాయల సాగుకు ప్రసిద్ధి. ఇందులోనూ రైతులు టమాట అధికంగా పండిస్తారు.
- జిల్లాకు రోజూ సుమారు 5 టన్నుల –6టన్నుల వరకు అవసరం అవుతుంది.
- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ప్రధాన కూరగాయల మార్కెట్లు. పలు గ్రామాల్లోంచి కూడా ఇక్కడకే పంట వస్తుంది.
- అయితే, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాలకు సమీపంలోని గ్రామాల రైతులు ఈ పంట అధికంగా సాగు చేస్తారు.
- టమాట సాగు ద్వారా వీరికి అదనపు ఆదాయం సమకూరుతోంది. అంతేకాదు.. ధర అధికంగా పలుకుతుందని భావించిన పట్టణాలకు దూరంగా ఉన్న చాలామంది అన్నదాతలు కూడా ఈ పంట సాగు చేశారు.
- దీనికితోడు, కూరగాయల వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా మదనపల్లె, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి టమాటను తెప్పిస్తున్నారు.
- డిమాండ్‌కు మించి పంట మార్కెట్‌లోకి వచ్చి చేరుతుండడంతో ధర పడిపోతోందని వ్యాపారులు వివరిస్తున్నారు.



లక్ష్మీపూర్‌లో టమాట తెంపుతున్న రైతులు

- ఈక్రమంలో కొందరు రైతులు వ్యాపారులకు హోల్‌సేల్‌గా విక్రయించడంలేదు.
- మార్కెట్‌లో నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ కిలోపై అదనంగా రూ.2 పొందుతున్నారు. అయినా.. వారికి గిట్టుబాటు కావడంలేదు.

బాక్స్ ధర రూ.80..

మొన్నటివరకు బాక్స్(25 కిలోలు) రూ.600 వరకు ధర పలికిన టమాట.. ఇప్పుడు రూ.80కి పడిపోయింది. దీంతో, గ్రామాల నుంచి మోటారు సైకిళ్లపై మార్కెట్లకు తీసుకొస్తున్న రైతులకు కనీసం పెట్రోల్ ఖర్చు కూడా రావడం లేదు. ఆటోలో తరలిస్తే చార్జీకే సరిపోతోంది. అయినా, చేనులో పంటను వదిలేయలేక.. మార్కెట్‌కు తీసుకొచ్చి ఏదోఓధరకు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈసారి పంట సమయంలో చల్లని వాతావరణం ఉండడం, ఓ మోస్తారు ఉష్ణోగ్రతలు అనుకూలంగా మారడం, తెగుళ్ల బెడద లేకపోవడంతో అధిక దిగుబడి వస్తోందని అధికారులు వివరిస్తున్నారు. కొన్నిచోట్ల స్టేకింగ్ పద్ధతిన టమాట సాగు చేయడంతో గుంటకు 1 టన్ను – 2 టన్నుల వరకు దిగుబడి వచ్చిందని వెల్లడిస్తున్నారు.

కిలో రూ.2కు ఎలా అమ్మేది?



బాక్స్ టమాట మార్కెట్‌కు తీసుకెళ్తే కిలో రూ.2కు అడుగుతున్నరు. ఏం చేయాలో అర్థంకావడం లేదు. మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లినా కనీసం పెట్రోల్ ఖర్చు కూడా రావడం లేదు. ఏ పంట పండించినా రైతుకు గిట్టుబాటు కాకపోతే శ్రమ వ్యర్థం.

– గడ్డం తిరుపతి, రైతు, జగిత్యాల

తెంపిన ఖర్చు రావడం లేదు



మంచి ధర ఉంటుందని పదిగుంటల్లో టమాట వేసిన. ఇప్పుడు ధర లేదు. పెట్టుబడి కూడా రావడం లేదు. కనీసం టమాట తెంపిన కూలీల ఖర్చు మిగలడంలేదు. పెట్టెకు రూ.60– రూ.70కి మించి వస్తలేదు. అందుకే తోటలో విడిచిపెట్టడమే మంచిదనిపిస్తున్నది.

– పన్నాల కవిత, రైతు, జగిత్యాల

పంట చేతికొచ్చాక పతనం



టమాట పంట చేతికి వచ్చాక ధరలు పతనం అవ్వుతుండటం ఆందోళన కలిగిస్తుంది. నేను 15గుంటల్లో టమాట పండిస్తున్న. కనీసం రూ.50 వేలు వస్తాయనుకుంటే.. రూ.5 వేలు కూడా వచ్చేట్లు లేదు. టమాట బాగా ఉంది. ఏంచేయాలో తెలియడం లేదు.

– సంగెపు తిరుపతిరెడ్డి, రైతు, లక్ష్మీపూర్

కాషాయ జెండా ఎగరాలి

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

రాయికల్(జగిత్యాల): కాషాయ జెండా ఎగిరి రామ రాజ్యం రావాలని ఎంపీ అర్వింద్ అన్నారు. శుక్రవారం సింగరావుపేటలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అల్లీపూర్ – రాయికల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పడాల తిరుపతి ఆధ్వర్యంలో సుమారు 100 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. అర్వింద్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో 3,431 డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఉండగా, 1,285 మంది మైనార్టీలకు మంజూరు చేశారని, మన హిందూ జనాభా ఎక్కువ ఉన్నా ఎందుకు ఇ వ్వలేదని ప్రశ్నించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ప్రతీపనిలో పర్సంటేజీలు తీసుకుంటున్నారని ఆరోపించారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎందుకు తెరవలేదని ప్రశ్నించారు. సర్పంచులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులను వారికి తెలియకుండానే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుని అవమానపర్చిందని విమర్శించారు. అనంతరం ఇటీవల వృతి చెందిన కుమ్మరిపల్లిలోని బీజేపీ కార్యకర్త రాజు కుటుంబ సభ్యులను ఎంపీ పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, నాయకులు మదన్‌మోహన్, అన్నవేని వేణు, కల్లెడ ధర్మపురి, సురతాని భాగ్యలక్ష్మి, పడాల పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

కార్యకర్తలే బలం

మల్లాపూర్(కోరుట్ల): బూత్‌స్థాయి కార్యకర్తలే ప్రధాని నరేంద్రమోదీ బలమని ఎంపీ అర్వింద్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సత్యనారాయణరావు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అర్హత ప్రాతిపదికన ఇళ్లు కేటాయించండి'

జగిత్యాలటౌన్: అర్హత ప్రాతిపదికన పేదలకు డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూకపెల్లి అర్బన్ కాలనీలో 4,500ఇళ్లు అందుబాటులో ఉంటే 3,459మందిని అర్హులుగా గుర్తించి, వాటిని కేటాయించేందుకు డ్రా పద్ధతిన గందరగోళం సృష్టించారని ధ్వజమెత్తారు. ఇందుకు అధికారుల వైఖరే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అర్హత ప్రాతిపదికన జగిత్యాలలో 120ఎకరాల స్థలం కొనుగోలు చేసి 4వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టగా 1,676 ఇళ్లు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. వాటిని పూర్తి చేసేందుకు సొంతఇంటి నిర్మాణం పథకం కింద రూ.3లక్షలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు కళ్లెపెల్లి దుర్గయ్య, నక్కజీవన్, శంకర్, నందయ్య, రాజేందర్, అశోక్, దేవేందర్‌రెడ్డి, రమేశ్, రఘువీర్‌గౌడ్, గుండ మధు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

- ఆర్బీఐ ఏజీఎం అనిల్‌కుమార్ కొలబరే

జగిత్యాలరూరల్: మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం అనిల్‌కుమార్ కొలబరే సూచించార. జాబితాపూర్ గ్రామంలో నవత, నర్మద గ్రామైక్య సంఘా సమావేశాలు శుక్రవారం జరిగాయి. ఆయన మాట్లాడుతూ, బ్యాంక్ రుణాలు, పొదుపు నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఆర్థిక అక్షరాస్యత సాధ్యమన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు క్రమం తప్పకుండా రుణాలు తీసుకుని, వాయిదాలను ప్రతినెలా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. వ్యక్తిగత ఖాతాలు ఉన్నవారు రూపీ ఏటీఎం కార్డులు తీసుకోవాలని, వీటిద్వారా 90 రోజుల్లో ఒక విత్‌డ్రా చేసుకున్న వారికి ప్రమాదబీమా ఇన్సూరెన్స్ కింద రూ.2 లక్షలు, సాధారణ బీమా రూ.30 వేలు పరిహారంగా అందుతాయని తెలిపారు. అనంతరం జాబితాపూర్ మహిళా సంఘం సభ్యులు హోంఫుడ్ యూనిట్, సూపర్‌మార్కెట్, వాటర్‌ప్లాంట్, కిరాణం, బట్టలషాపులు, హోటల్స్, టైలరింగ్, మగ్గం వర్క్స్ యూనిట్లు నిర్వహించడంపై అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. లీడ్ బ్యాంక్ ట్రైనర్ మధుసూదన్, ఏపీఎం గంగాధర్, సర్పంచ్ మమత, ఎంపీటీసీ స్వప్న, సీసీ విద్యాసాగర్, వీవో అధ్యక్షురాలు శ్యామల, భాగ్యలక్ష్మి, వీఏవోలు లలిత, ప్రమోద్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పిల్లల మృతదేహాలకూ పోస్టుమార్టం..?

- మమత శరీరంలో విషముంటే.. శవపరీక్షలు అనివార్యం
- ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు ఆధారంగా పోలీసుల నిర్ణయం
- పక్కపక్కనే అక్కాతమ్ముళ్ల సమాధులు
- పిల్లలను ఖననం చేసి దాదాపు రెండు నెలలు
- గంగాధర మిస్టరీ మరణాల్లో కొత్తకోణం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సంచలనం సృష్టించిన కరీంనగర్ జిల్లాలోని గంగాధర మిస్టరీ కేసు మరో మలుపు తిరగనుంది. పోలీసులు అనుమానిస్తున్నట్లు ఇంటి పెద్ద వేముల శ్రీకాంత్ తన భార్యాపిల్లలపై విషప్రయోగం చేశాడని నిర్ధారణ అయితే.. పిల్లల మృతదేహాలకూ పోస్టుమార్టం తప్పేలా లేదు. డిసెంబరు 30న అర్ధరాత్రి వేముల శ్రీకాంత్ సోడియం హైడ్రాక్సైడ్ తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇదే విషయాన్ని చికిత్స సమయంలో వైద్యులకు చెప్పాడు. ఈ పరిణామంతో పోలీసుల దర్యాప్తు అకస్మాత్తుగా శ్రీకాంత్ వైపు తిరిగింది. శ్రీకాంత్ బయోటెక్నాలజీలో పీజీ చేయడం.. ఫుడ్ సైన్స్ లెక్చరర్ కావడం.. రోజూ ప్రయోగాల కోసం ల్యాబ్‌లో రసాయనాలు వినియోగించడం.. వెరసీ అతనికి కెమికల్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ఉందని పోలీసులు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల తరహాలోనే తానూ రక్తపువాంతులు, విరోచనాలు చేసుకుని మరణించడంతో వారి శరీరంలోనూ సోడియం హైడ్రాక్సైడ్ చేరిందా..? అనే సందేహాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఫోరెన్సిక్ అధికారులు మమత శరీరంలో ఆర్సెనిక్ ఆనవాళ్లు ఉన్నాయని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయాన్ని నిర్ధారించుకునేందుకు వారు మరింత లోతుగా రసాయన విశ్లేషణ జరుపుతున్నారు. త్వరలోనే ఈ విషయంపై ఎఫ్ఎస్ఎల్ తుది నివేదిక పంపితే.. మమత మరణానికి స్పష్టమైన కారణం తెలియనుంది.



మమత, శ్రీకాంత్ (ఫైల్)



అద్వైత్, అమూల్య సమాధులు

45 రోజుల్లో నలుగురు

ఈ ఘటనల్లో తొలుత కుమారుడు అద్వైత్ (20నెలలు) వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురై నవంబరు 16న కన్నుమూశాడు. అవే లక్షణాలతో కూతురు అమూల్య (6) డిసెంబర్ ఒకటిన ప్రాణాలు విడిచింది. ఈ రెండు మరణాలకు వైద్యులు కారణాలు చెప్పలేకపోయారు. అంతు చిక్కని వ్యాధి, కలుషిత తాగునీరు కారణమనుకున్న వైద్యాధికారులు.. సమీపంలోని బావిలోని తాగునీటిని, బాధితుల బంధువులకు రక్తాన్ని పరీక్షించారు. అయినా వారికి ఏమీ చిక్కలేదు. దీంతో మిస్టరీ మరణాలు చేతబడి, మంత్రాల కా రణంగా జరుగుతున్నాయన్న ప్రచారం కూడా జరిగింది. శ్రీకాంత్ భార్య మమత (26) కూడా అనారోగ్యానికి గురై డిసెంబరు 18న మరణించింది. డిసెంబరు 30న శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. మొత్తం 45 రోజుల్లో మొత్తం కుటుంబం అనుమానాస్పద స్థితిలో తుడిచిపెట్టుకుపోయింది.

రెండు నెలల అనంతరం..

నవంబరు 16న 20 నెలల అద్వైత్ అనుమానాస్పదంగా మరణించాడు. అతడిని గంగాధర శివారులోని వంతెన సమీపంలో ఖననం చేశారు. డిసెంబరు ఒకటిన అమూల్య (6) కూడా కన్నుమూసింది. దీంతో తమ్ముడి సమాధి పక్కనే అక్కనూ ఖననం చేశారు. వీరిలో అద్వైత్ మరణించి 50 రోజులు, అమూల్య చనిపోయి 35 రోజులు దాటింది. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు రావడానికి వారం పట్టవచ్చని పోలీసులు అంటున్నారు. ఒకవేళ మమత శరీరంలో విష ఆనవాళ్లు ఉంటే పిల్లల మరణాలకు కారణం తెలుసుకోవాల్సి ఉంటుంది. అదే నిజమైతే.. పిల్లలు మరణించిన దాదాపు రెండు నెలల అనంతరం పోస్టుమార్టం చేయాల్సి వస్తుందని పలువురు సీనియర్ పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

మమత శరీరంలో ఆర్సెనిక్..! మరి పిల్లల్లో..?

పోలీసుల వినతి మేరకు మమత పోస్టుమార్టం సమయంలో వైద్యులు విస్రా (శరీరంలోని కీలక అంతర్భాగాలు)ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మమత శరీర భాగాల్లో ఆర్సెనిక్ ఆనవాళ్లను గుర్తించారు. దీన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే.. వారి శరీరంలోకి ఎలా చేరింది..? పిల్లల మరణాలకు కారణం ఆర్సెనికా..? లేదా సోడియం హైడ్రాక్సైడా..? అనే విషయాన్ని పోలీసులు ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. పిల్లలిద్దరూ అనారోగ్య లక్షణాలతో మరణించడంతో వారికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఇపుడు వారి మరణంపై అనేక సందేహాలు వెలుగులోకి రావడంతో వారి శవాలకు పోస్టుమార్టం తప్పనిసరి కానుంది. అందుకే పిల్లల శరీర భాగాల నుంచి విస్రా (అంతర్భాగాల నుంచి నమూనాలు)ను తీసుకోవాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

విద్యారంగంలో జగిత్యాలను అగ్రగామిగా నిలపాలి




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాల: విద్యారంగంలో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రవి అన్నారు. శుక్రవారం ఎస్టీయూ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆయన జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, గుణాత్మకమైన ఫలితాల కోసం ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. మన ఊరు.. మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తోందని అన్నారు. ఖాళీగా ఉన్న సబ్జెక్టుల స్థానాల్లో వెంటనే విద్యావలంటీర్లను నియమించుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, మచ్చ శంకర్, మేకల ప్రవీణ్, గంప కిరణ్, రాజేశ్, రామకృష్ణ, కృష్ణ, వెంకటేశ్, రాజ్‌కిరణ్, దశరథరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గుండెలో వాన'కు పీచర సునీతారావు పురస్కారం





అశోక్‌కుమార్, కథా రచయిత

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ కథకుడు, నవలా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'గుండెలో వాన' కథా సంపుటి మరో సాహిత్య పురస్కారానికి ఎంపికైంది. హైదరాబాద్ రవీంద్రభారతి మినీహాల్‌లో ఆదివారం పీచర సునీతారావు స్మారక సాహిత్య పురస్కారం అందించనున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనతోపాటు కవిత్వంలో వెల్దండి శ్రీధర్, విమర్శలో వెలదండ నిత్యానందరావులు కూడా ప్రముఖ కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి చేతులమీదుగా ఈ అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. గుండెలో వాన కథల పుస్తకానికి గతంలో ఆంధ్ర సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారం, మరో రెండు అవార్డులు దక్కాయి.

సౌత్‌జోన్ స్థాయి పోటీలకు ఎంపిక



రాహుల్

జగిత్యాల: స్థానిక ఎస్కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న సీహెచ్. రాహుల్ శాతవాహన యూనివర్సిటీ తరఫున సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 9 – 12 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జేఎ న్టీయూ నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్, వైస్ ప్రిన్సిపల్ కరుణాకర్, పీడీ రవికుమార్ విద్యార్థిని అభినందించారు.

కలుషిత నీటితో విద్యార్థులకు అస్వస్థత

- 29 మందిని సిరిసిల్ల ఆస్పత్రికి తరలింపు
- 25 మంది డిశ్చార్జ్.. నలుగురికి ప్రత్యేక వైద్యం
- ఆందోళనలో తల్లిదండ్రులు



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు



విద్యార్థులను పరామర్శిస్తున్న ఆగయ్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/సిరిసిల్ల టౌన్: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 29 మంది శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. కలుషిత నీటితో చేసిన భోజనం తినడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికాగా సమాచారం అందుకున్న తహసీల్దార్ జయంత్‌కుమార్ స్థానిక వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసి ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాఠశాలలో మొత్తం 95 మంది విద్యార్థులు చదువుకుంటుండగా అందులో 29 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో నలుగురు విద్యార్థులు శరవున్ లిల్లి, బి.దివ్య, డి.శ్రీజ, గనగోని శ్రీనివాని తీవ్ర అస్వస్థతకు గురికాగా వారికి వైద్యులు వైద్యం అందిస్తున్నారు. ఈ సంఘటనపై తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన తెలిపారు.

సంపులో నింపిన నీటితో వంటలు

పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా నీటి సంపుతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం తయారీ రోజూ భగీరథనీటితోపాటు ఫిల్టర్‌వాటర్‌ను ఉపయోగిస్తారు. రెండు రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్కూల్‌కు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన సంపులో శుక్రవారం ఉదయం ట్యాంకర్ ద్వారా నీటిని నింపారు. సంపులో నింపిన నీటితోనే నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేశారు. ఆ భోజనం తిన్న 29 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు పాపయ్య, విద్యార్థుల పరిస్థితిపై స్థానిక వైద్యాధికారులకు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విద్యార్థులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. 25 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు తెలిపారు. 25 మందికి వైద్యం అందించి ప్రత్యేక వాహనంలో ఇంటికి పంపించినట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ జిల్లా విద్యాధికారి, డీఎంహెచ్‌వోతో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

వైద్యుల పర్యవేక్షణలో నలుగురు

తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులకు జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను జిల్లా విద్యాధికారి రాధాకిషన్, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంఈవో రఘుపతి, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎస్సై శేఖర్ పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి ముందు ఏబీవీపీ నాయకులు ధర్నా చేయగా పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

ప్రేమించి పెళ్లి చేసుకుంటే..
పోలీసులు వేధిస్తున్నారు

- ఇద్దరు అధికార పార్టీ నేతల ఒత్తిడే కారణం
- సిరిసిల్లలో బోరుమన్న బొప్పాపూర్ యువకుడు



సిరిసిల్లలో పెళ్లి ఫొటో, పోలీసులు పగులగొట్టిన సెల్‌ఫోన్‌ను చూపుతున్న బాలకిషన్

సిరిసిల్ల: ప్రేమించి పెళ్లి చేసుకుంటే పోలీసులే తమను విడదీసి, విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నారని ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన యువకుడు లంబ బాలకిషన్ శుక్రవారం కన్నీటి పర్యంతమయ్యాడు. ఎల్లారెడ్డిపేట పోలీసుల వేధింపులను భరించలేకపోతున్నానని, తనకు చావే శరణమని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బాధితుడు లంబ బాలకిషన్(26) విలేకరుల సమావేశంలో తన ప్రేమకథను వివరించారు. రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన తాను.. తన ఇంటి ముందుండే 20 ఏళ్ల యువతిని ప్రేమించానని, 2021 డిసెంబరు 14న ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నామని వివరించారు. అదే రోజు ఎల్లారెడ్డిపేట పోలీసులను ఆశ్రయించగా ఇరువర్గాల పెద్దలకు కౌన్సెలింగ్ చేసి పంపించారని వివరించారు. అదే రోజు వేములవాడకు వెళ్లి ఆశ్రయం పొందినట్లు తెలిపారు. అమ్మాయి తండ్రి, బంధువులు తాము ఆశ్రయం పొందిన ఇంటికి రాగా.. డయల్ 100కు కాల్‌చేసి పోలీసుల రక్షణ కోరినట్లు వివరించారు. అమ్మాయి కుటుంబ సభ్యులు ధనబలంతో, అధికార పార్టీ నేతల అండతో అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లారని, తనపై వరకట్నం వేధింపుల కేసు పెట్టారని వాపోయాడు. దీనిపై తాను హైకోర్టులో కేసు వేశానని, ఆ కేసు విచారణలో ఉండగానే ఎల్లారెడ్డిపేట పోలీసులు వేధిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యాడు.

పోలీసులు బెదిరిస్తున్నారు

ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి, ఎస్సై శేఖర్ తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అమ్మాయికి విడాకులు ఇవ్వాలని, లేకుంటే కేసులు పెట్టి జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని బాలకిషన్ ఆరోపించారు. తాను వ్యవసాయం చేసుకుంటూ.. సాధారణ జీవితం గడుపుతున్నానని, న్యాయస్థానంపై నమ్మకంతో ఉన్నానని వివరించారు. ఎస్సై సూచన మేరకు కానిస్టేబుల్ ఒకరు నా సెల్‌ఫోన్ తీసుకుని పాస్‌వర్డ్ చెప్పాలని వేధించాడని, తాను చెప్పకపోవడంతో ఐ–ఫోన్‌ను నేలకేసి కొట్టడంతో పగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసుల వేధింపులతో తనకు చావే శరణ్యమని, అధికార పార్టీ నేతలు ఇద్దరు పోలీసులతో ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. తనపై కేసులు కోర్టు విచారణలో ఉండగా.. పోలీసులు వేధించడం ఏమిటని బాలకిషన్ ప్రశ్నించాడు. తనపై తప్పుడు కేసులు పెడుతామని, లాకప్పులో వేస్తామని పోలీసులు వేధిస్తున్నారని వివరించారు. అగ్రకుల అమ్మాయిని ప్రేమించిన పాపానికి పోలీసులే మమ్మల్ని వేరు చేసి.. ఇప్పుడు వేధిస్తున్నారన్నారు.

మా విచారణకు సహకరించడం లేదు

బాలకిషన్ పెళ్లి చేసుకున్న ఫొటోలను, ఆ అమ్మాయితో ఉన్న ఫొటోలను సోషల్‌మీడియాలో పెడుతున్నాడు. అమ్మాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అతనిని పిలిచి విచారించాం. మా విచారణకు సహకరించడం లేదు. అతనిపై ఓ కేసు కూడా నమోదైంది. మేం అతనిని వేధించలేదు. విచారణకు సహకరిస్తే నోటీస్ ఇస్తాం. లేకుంటే రిమాండ్ చేస్తాం.

– మొగిలి, ఎల్లారెడ్డిపేట సీఐ

కేసులు పెట్టినా.. దీక్ష విరమించేది లేదు

- మురికి కాలువలు నిర్మించాల్సిందేనన్న వెంటాపూర్‌వాసులు
- పోలీసులతో వాగ్వాదం



పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో మురికి కాలువలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజు శుక్రవారం కొనసాగింది. శిబిరం వద్దకు సీఐ మొగిలి ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి, దీక్ష విరమించాలని, లేదంటే అందరిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎన్ని కేసులు పెట్టినా సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చిచెప్పారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి పోలీసుల తీరుపై మండిపడ్డారు. సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రామస్తులను కేసులు పెడతామని, అరెస్టు చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. అదే జరిగితే గ్రామస్తులందరితో కలిసి ఠాణా ఎదుట ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ మేడిశెట్టి బాలయ్య, వార్డు సభ్యులు గడ్డం రవి, గుర్రాల రాజిరెడ్డి, పూర్ణ చందర్, బీజేవైఎం జిల్లా కోశాధికారి మహేశ్, బూత్ అధ్యక్షుడు రమేశ్ తదితరులున్నారు.

స్వగ్రామానికి మంజుల మృతదేహం

- అంత్యక్రియలు పూర్తి



మంజుల మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు



మంజుల (ఫైల్)

రుద్రంగి(వేములవాడ): మండలంలోని సర్పంచ్ తండాకు చెందిన మాలోతు మంజుల కుటుంబ కలహాలతో గురువారం రాత్రి హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఆమె మృతదేహం శుక్రవారం ఉదయం స్వగ్రామం చేరింది. మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆమెను విగత జీవిగా చూసి, కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మంజుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం 14 నెలల బాబుకు తల్లిని లేకుండా చేసిందని స్థానికులు కంటతడి పెట్టారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మాణిక్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ మాణిక్‌రెడ్డి కోరారు. స్థానిక ఐకేపీ(సెర్ప్) కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వీవోఏల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. వారికి చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. బ్యాంకు లింకేజీ లక్ష్యానికి అనుగుణంగా స్వశక్తి సంఘాలకు రుణాలు మంజూరు చేశామని ఆయన వివరించారు. వీవోఏల వారీగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంక్ లింకేజీ లక్ష్యంపై సమీక్ష నిర్వహించి నెలాఖరులోగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజేశ్, డీఎంజీ మెట్టు దాస్, సీసీలు రమేశ్, లక్ష్మీరాజం, రాజు, స్రవంతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు మారు ప్రమీల, వీవోఏలు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లి కారు బోల్తా



పొలంలో బోల్తా పడిన కారు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామం నుంచి మల్కాపూర్ వెళ్లే దారిలో ఓ కారు అదుపుతప్పి, పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్‌లోని ఓ ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చిన ఓ వ్యక్తి గురువారం అర్ధరాత్రి కారులో తడగొండ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి, రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లి, బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని తెలిసింది. శుక్రవారం ఉదయం సంబంధిత వ్యక్తులు వచ్చి, జేసీబీ సాయంతో కారును తీసుకెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

జాబ్ కొట్టడమే లక్ష్యంగా సిద్ధమవ్వండి



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో కేటీఆర్ ఉచిత కోచింగ్ సెంటర్ నుంచి ఎస్సై, కానిస్టేబుల్ మెయిన్స్ అర్హత సాధించిన అభ్యర్థులకు శుక్రవారం దిశానిర్దేశం చేశారు. ప్రిలిమ్స్ నుంచి ఈవెంట్స్ వరకు 120 మంది యువతీయువకులకు ఎంపీపీ శరత్‌రావు ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఇప్పించారు. ఇందులో 30 మంది ఈవెంట్స్‌లో అర్హత సాధించారు. వంద రోజులలో ఎస్సై, కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు ఉన్నాయని, అత్యుత్తమ ఫ్యాకల్టీతో కోచింగ్ ఇప్పిస్తామన్నారు. జాబ్ కొట్టడమే లక్ష్యంగా సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుండం నర్సయ్య, హెడ్ కానిస్టేబుల్ గంగయ్య, కుమార్, రవి, రాజశేఖర్, ఖాసీం ఉన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని టవరెక్కిన మహిళ



మమతతో మాట్లాడుతున్న ఎస్సై కిరణ్‌కుమార్

రాయికల్(జగిత్యాల): మండలంలోని కుమ్మరిపల్లి గ్రామంలో తమ భూ సమస్య పరిష్కరించాలంటూ యాచమనేని మమత శుక్రవారం టవరెక్కింది. తన అత్తకు సంబంధించిన భూమిని తమకు ఇవ్వకుండా ఆడబిడ్డలు అడ్డుపడుతున్నారని ఆరోపించింది. విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్‌కుమార్ ఫోన్ చేసి, సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆమె కిందికి దిగి రావడంతో ఎస్సై వచ్చి, ప్రత్యక్షంగా బాధితురాలితో మాట్లాడారు.

9 నుంచి సదరెం శిబిరాలు

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో దివ్యాంగుల కోసం సదరెం శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న ఓహెచ్, 10న హియరింగ్, 11న మూగ, 12న ఓహెచ్, 13న ఎంఆర్ ఎంఐ పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలకు చెందినవారు ఆధార్‌కార్డు తీసుకొని, హాజరు కావాలని ఆయన కోరారు.

రాజన్న సేవలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే గణేశ్ గుప్తాను సన్మానిస్తున్న పర్యవేక్షకుడు శంకర్

వేములవాడ: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా శుక్రవారం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు అల్లి శంకర్, శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు కట్కూరి శ్రీనివాస్, తాటికొండ పవన్‌కుమార్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి రూ.10 లక్షలు కేటాయింపు



ఎమ్మెల్యే రవిశంకర్‌తో నాయకులు

జగిత్యాల: జగిత్యాల వెల్మ సంక్షేమ మండలి వృద్ధాశ్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్ రూ.10 లక్షలు కేటాయించారు. నూకపల్లి అర్బన్ కాలనీలో నిర్మిస్తున్న ఈ ఆశ్రమానికి నిధులు కేటాయించడంపై వెల్మ సంక్షేమ మండలి నాయకులు శుక్రవారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెల్మ సంక్షేమ సంఘం నాయకులు వేణుగోపాల్‌రావు, రాంమోహన్‌రావు, కృష్ణారావు, సాగర్‌రావు, రాజనర్సింగరావు, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాల పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో శివాజీ

రాయికల్(జగిత్యాల): గ్రామాల్లో చేపట్టిన క్రీడా ప్రాంగణాల పనులను వేగవంతం చేయాలని అదనపు డీఆర్డీవో శివాజీ సూచించారు. శుక్రవారం ఉప్పుమడుగు, అల్లీపూర్, సింగరావుపేట, కిష్టంపేట గ్రామాల్లో చేపట్టిన క్రీడాప్రాంగణాల పనులను ఆయన పరిశీలించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు అధికారులు, నాయకులు తదితరులున్నారు.

రాజన్న సన్నిధిలో శివదీక్షలు ప్రారంభం



శివదీక్ష తీసుకున్న భక్తులు

వేములవాడ: రాజన్న సన్నిధిలో మండల శివదీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఓం నమఃశివాయ ఉచ్ఛరణతో ఆలయ ప్రాంతం మార్మోగింది. అర్చకుడు నందగిరి శంకరయ్య, గురుస్వాములు వాసాల మర్రి గోపి, తుమ్మల సంతోష్‌ల ఆధ్వర్యంలో 300 మంది దీక్ష తీసుకున్నారు. గత 32 ఏళ్లుగా వేములవాడలో శివదీక్షలు కొనసాగుతున్నట్లు అర్చకులు తెలిపారు. అర్ధ మండల శివదీక్షలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయని, శివదీక్షా విరమణ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 18న భీమేశ్వరాలయంలో ఉంటుందని పేర్కొన్నారు.

ఆరుద్ర నక్షత్రోత్సవం

ఆరుద్ర నక్షోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ రాజన్నకు శుక్రవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

- బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జగిత్యాలటౌన్: ఇరుకైన యావర్‌రోడ్డులో అనేక ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు పోతున్నా పట్టింపులేదని, విస్తరణ అంశం ఎన్నికల హామీగా మారిపోయిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి అన్నారు. యావర్‌రోడ్డు విస్తరణ చేపట్టి ప్రమాదాలు నివారించాలని కోరుతూ శుక్రవారం భారతీయ జనతాపార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ 2018ఎన్నికల సందర్భంగా యావర్‌రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చి గెలిచిన ఎమ్మెల్యే.. ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. కేవలం ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచోటే తూతూ మంత్రంగా విస్తరణ చేపట్టి చేతులు దులుపుకున్నారని ధ్వజమెత్తారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణతో ఆస్తులు కోల్పోయిన వారికి తగిన పరిహారం లేదా స్థలానికి బదులు స్థలం కేటాయించాలని కోరారు. కొత్త బస్టాండ్ వద్ద అడ్డుగా ఉన్న జనరేటర్ రూం తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుర్రం రాము, నాయకులు ఏపీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, చీటి శేఖర్‌రావు, లక్ష్మారెడ్డి, మాడిశెట్టి మల్లేశం, బిట్టు, జ్ఞానేశ్వర్, బిక్షపతి తదితరులు ఉన్నారు.

వానరానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంతోష్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గురువారం వాహనం ఢీకొని, ఓ వానరం తీవ్రంగా గాయపడింది. ఎంపీటీసీ సభ్యుడు బైరినేని రాము, బీజేపీ సీనియర్ నాయకుడు గజభీంకార్ సంతోష్ వెటర్నరీ ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించారు. అయితే ఆ వానరం శుక్రవారం చనిపోయింది. సురేష్ స్పందించి, మానేరు వాగుకు తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నేరెళ్ల హరీశ్, గుంజె రంగనాథ్, దేవరాజు పాల్గొన్నారు.